ప్రజాశక్తి
ఆదివారం 6 జులై 2025 5 అనంతపురం





జెసిబితో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ, అధికారులు

జెఎన్‌టియులోనూ అధ్యాపకుల కొరత..!

◆ ఉన్నది మూడొంతులే.. ◆ బోధకుల్లేక భావి ఇంజినీర్లకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జెన్‌టియునూ అధ్యాపకుల కొరత పీడిస్తోంది. పూర్తి స్థాయిలో బోధించేవారు లేకపోవడంతో బావి ఇంజినీర్లకు తిప్పలు తప్పడం లేదు. ఉండాల్సిన దానిలో మూడోవంతు మాత్రమే అధ్యాపకులు ఇక్కడ ఉన్నారు. తక్కిన అన్నీ పోస్టులు ఖాళీగానే ఉంటున్నాయి. రెగ్యులర్ అధ్యాకుల్లేకపోవడంతో సాంకేతిక విద్యను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవడంలో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు.

అనంత జెఎన్‌టియుకు సుదీర్ఘమైన చరిత్ర

భారత దేశానికి స్వాతంత్రం రావడం కంటే ముందే 1946లో అనంతపురం కేంద్రంగా ఇంజినీరింగు కళాశాల ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. మద్రాసు ప్రావిన్సులో దీని ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. మొదటి గుండి ప్రాంతంలో ప్రారంభం అవగా 1948లో అనంతపురానికి బదిలీ అయింది. అప్పటి నుంచి మద్రాసు యూనివర్శిటీ అనుబంధంగా నడిచింది. 1955లో దీన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోకి మార్చారు. 1972లో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు సాంకేతిక విద్యను ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వేరుచేశారు. అప్పుడు అనంతపురం జెఎన్‌టియు కళాశాల హైదరాబాద్ జెఎన్‌టియు అనుబంధంగా మారింది. 2008లో దీన్ని విశ్వవిద్యాలయంగా మార్చారు. అప్పటి నుంచి ఈ విశ్వవిద్యాలయం పరిధిలో అనంతపురం జెఎన్‌టియు కళాశాలతోపాటు, పులివెందుల, కలికిరి ఇంజనీరింగ్ కళాశాలతోపాటు ఒటిఆర్‌ఐని అనంతపురం జెఎన్‌టియు కళాశాలుగా మార్చారు. ఇక్కడ నుంచి పెద్ద పెద్ద స్థాయిలో ఉద్యోగాలు చేసేవారు ఉన్నారు.

ఉన్నది మూడొంతులే..!

ప్రతిష్టాత్మకమైన జెఎన్‌టియు విశ్వవిద్యాలయంను అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. దీని పరిధిలో ఆరు డిపార్టుమెంట్లు ఉన్నాయి. మొత్తం 300 మంది బోధనా సిబ్బంది ఉండాల్సి ఉంది. ఉన్నది మాత్రం 94 మంది మాత్రమే. తక్కిన 206 పోస్టులు ఖాళీగా నున్నాయి. ప్రొఫెసర్లు తొమ్మిది మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 33 మంది, 164 పోస్టులు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా నున్నాయి. ఇంత పెద్దఎత్తున ఖాళీగా ఉండటంతో విద్యాబోధన అంతంత మాత్రంగానే ఉంటోంది. ఉన్న కొద్ది మందిలోనూ ఎక్కువ మంది పరిపాలనాపరమైన బాధ్యతలు చూస్తున్నారు. వీరు కళాశాలలకు వెళ్లి విద్యాబోధన చేయడం కష్టతరమైన పనిగా ఉంటోంది. అసలే సాంకేతిక విద్య కావడంతో బోధకులు లేకుండా విద్యను అభ్యసించడం పెద్ద సమస్యగానే ఉంటోంది. ప్రభుత్వం గతంలో ఈ పోస్టుల భర్తీని నోటిఫికేషన్ జారీ చేసినా వివిధ కారణాలతో భర్తీ చేయలేదు. విశ్వవిద్యాలయంలోని అనంతపురం జెఎన్‌టియు కళాశాలకు మంచి విద్యను అందించేదిగా పేరుంది. ఇప్పుడు చూస్తే బోధకుల తక్కువగా ఉండటంతో ఎంతో ఆశగా వచ్చే విద్యార్థులకు నిరాశ తప్పడం లేదు.





జీడిపల్లి జలాలను తీసుకొస్తాం

◆ ప్రజల జీవనాడి బీటీపీ

◆ ప్రభుత్వ విప్ కాలవ, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే అమిలినేని



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఏడాదిన్నర లోపు భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులు పూర్తి చేసి జీడిపల్లి జలాలను బిటిపికి తీసుకొస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. బ్రహ్మసముద్రం మండలం పడమటికోడిపల్లి సమీపంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో బిటిపి కాలువ మరమ్మతు పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులున్నా బీటీపీకి కృష్ణజలాలు తీసుకురావడానికి అవసరమైన రూ.1200కోట్లు ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు రావడం హర్షనీయమన్నారు. మంత్రి నారాలోకేష్, మంత్రులు పయ్యావ్వులకేశవ్, నిమ్మల రామనాయుడుల సహకారంతోనే ఈప్రాంత రైతుల కలలను సాకారం చేస్తున్నామన్నారు. ఎంపీ అంబిక మాట్లాడుతూ ప్రతిపక్షంలో వునప్పుడు ఇచ్చిన హామీ మేరకు కృష్ణా జలాలను బీటీపీకి తీసుకువచ్చే విషయంలో ఎమ్మెల్యేలు కాలువ, సురేంద్రబాబు, ఎంపీగా తాను అహర్నిశలూ శ్రమించామని చెప్పారు. ప్రస్తుతం పనులు పున:ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ మరో 18 నెలల్లో కాలువ పనులు పూర్తిచేసి కృష్ణా జలాలను బీటీపీకి తీసుకొస్తామని చెప్పారు. 114 చెరువులకు నీరు నింపి రైతుల కలలను సాకారం చేస్తామన్నారు. ఇంకా పరిహారం అందని రైతులకు 15 రోజుల్లో అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ భరత్వాజ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మిదేవి, జెడ్పిటీసీ ప్రభావతమ్మ, టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు, ఆయకట్టు సంఘం నాయకుడు సుబాన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుబేర్‌యాదవ్, సీనియర్ నాయకులు రామ్మోహన్‌చౌదరి, చౌళం మల్లికార్జునతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల భారం వద్దు

'పిటిఎం' ఉత్తర్వులను రద్దు చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులపై బోధనేతర పనులతో ఒత్తిడికి గురి చేయొద్దని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలలో జరిగే మెగా పిటిఎంలో విట్నస్ అధికారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులే నియమించుకుని, వారిచేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలనే సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయ ఏడీ శ్రీనివాసరావును శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలసి విద్యార్థుల విద్యాభివద్ధిపై, పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై మాట్లాడుకోవడానికి 17 రకాల కమిటీలు, ఫోటోల అప్లోడ్‌లు, విట్నస్ అధికారులు ఇంత తతంగం అవసరమా అని ప్రశ్నించారు. పిటిఎం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చొద్దన్నారు. పాఠశాల ప్రారంభమై నెల రోజుల్లోపే యోగా పేరుతో వారం రోజులు, పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయాన్ని హరిస్తుందని తెలిపారు. బోధనేతర కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరప్ప, మోడల్ స్కూల్ శివానంద, ఓబుళపతి, మహమ్మద్ గౌస్, రమేష్, హనుమేష్, మహేంద్ర, సురేంద్ర, స్వాతి, మురళీధర్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలకు నిజనిర్ధారణ కమిటీలు

జెఎన్‌టియు పరిధిలో పరిశీలన - వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న విసి సుదర్శనరావు

ప్రజాశక్తి అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో నిజనిర్ధారణ కమిటీలు పర్యటించనున్నాయి. ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధన సిబ్బంది తదితర అన్ని వివరాలనూ పరిశీలించి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన్ రావు తెలియజేశారు. శనివారం నాడు వర్సిటీ పరిపాలన భవనం ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్లో నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు, కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియు పరిధిలో 80 ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నాయి. ఇందులో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం అధ్యాపకులు ఉన్నారా.. లేదా.? అన్నది పరిశీలించాలన్నారు. కళాశాలలో గవర్నర్ బాడీలు, బిఒఎస్ మీటింగ్‌లో జరుగుతున్నవే లేనిది పరిశీలించాలన్నారు. గత ఏడాదిలో ఎన్ని బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు.. అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు ఉన్నాయా లేదా..? అన్నది గుర్తించాలన్నారు. బోధన సిబ్బంది నియామకాల్లో వర్సిటీ నిబంధనలను పాటిస్తున్నారా లేదా అన్నది కూడ పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. కొత్తగా బ్రాంచ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న కళాశాల్లో అందుకు అనుగుణంగా సదుపాయాలు ఉన్నాయా అన్న అంశాలను గుర్తించాలన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఉన్నత ప్రమాణాలు పెంపునకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాల్సిన నేపథ్యంలో నిజనిర్ధారణ కమిటీలు నిశితంగా పరిశీలించి నివేదికల సమర్పించాలని కోరారు. ఉన్నత విద్యా మండలి ఇప్పటికే ఈఏపీ సెట్ కౌన్సిలింగ్ తేదీలు ప్రకటించిన నేపథ్యంలో వేగవంతంగా నిజనిర్ధారణ కమిటీలు పనిచేసి నివేదికలు అందజేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున వర్చువల్‌గా కమిటీలు పరిశీలన చేసి నివేదికలు సమర్పించే వెసులుబాటు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, అడ్మిషన్స్ డైరెక్టర్ సురేష్ బాబు, పరీక్షల విభాగం డైరెక్టర్ నాగ ప్రసాద్ నాయుడు, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ, ఐసిఎస్ డైరెక్టర్ భానుమూర్తి, డైరెక్టర్ సుజాత, కిరణ్మయి, ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరమని, ఈ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పిసిపిఎన్‌డిటి యాక్ట్ (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం)కు సంబంధించి జిల్లా స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఆడపిల్ల కూడా పుట్టకముందే చనిపోకుండా చూడాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేలా పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్యశాఖ, న్యాయశాఖ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 'ఆడపిల్లలను రక్షిద్దాం, బాలికల అభివృద్ధికి తోడ్పడుదాం అనే పోస్టర్లను అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలని తెలియజేశారు. కర్నాటక రాష్ట్రం బళ్లారిలో కొన్ని స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ చేస్తున్నట్లు సమాచారం ఉందని వాటి వివరాలను వెంటనే సేకరించాలన్నారు. ఈ కేంద్రాలు అన్నింటిపై తనిఖీలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥ఈబి.దేవి, ఆర్డీటీ ప్రతినిధి డా॥దుర్గేష్, సిఐ బాషా, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్‌ఈవో గంగాధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-గుంతకల్లు

ఈనెల 9వతేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు బి.శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జగదీష్ అధ్యక్షత సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా.. అమలు జరగడం లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కేంద్రంలో 8వ, రాష్ట్రంలో 12వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక చట్టాలను కొనసాగించి లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ప్రయివేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. ఆయా డిమాండ్ల సాధనకు నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రేష్మ, ప్రమీల, భాగ్య, విద్యుత్ రంగం పీరా, ఎస్‌కెఎం బాషా, తోపుడు బండ్ల సంఘం నాయకులు రామాంజి, తిమ్మప్ప, ఆటో యూనియన్ నాయకులు గోపాల్, మోహన్, హరి, హమాలీల నుంచి రాము, రవి, భవన నిర్మాణం సంఘం నాయకులు జాకీర్, శ్రీనాథ్, యేసు, దాసు, రంగనాయకులు పాల్గొన్నారు.

సమ్మెకు మెడికల్ రెప్స్ మద్దతు

అనంతపురం కలెక్టరేట్ : లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పని గంటల పెంపుదల ఉపసంహరించుకోవాలని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రత్యక్ష్యంగా పాల్గొననున్నట్లు యూనియన్ జాతీయ నేతలు ఎజి రాజమోహన్, మనోహర్ తెలిపారు. ఈమేరకు శనివారం హెచ్‌ఎల్‌సి కాలనీలోని మెడికల్ హాల్‌లో సార్వత్రిక సమ్మె గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రంగారెడ్డి, జిల్లా మెడికల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, జిల్లా నాయకులు సురేంద్ర, రామాంజి, కదిరప్ప, మంజు, శివారెడ్డి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు



భక్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెద్ద సరిగెత్తు ఆదివారం వైభంగా జరగనుంది. పెద్దసరిగెత్తుకు భారీ ఎత్తున భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా కుళ్లాయిస్వామికి పొంగలి, బెల్లం పానకం నైవేధ్యంగా సమర్పించి చదివింపులు చేయిస్తారు. ఇకపోతే శనివారం కోర్కెలు తీరిన పలువురు భక్తులు అగ్నిగుండం చుట్టూ పోర్లుదండాలు చేశారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చిన్నసరిగెత్తు విడి దినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం కుళ్లాయిస్వాని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కుళ్లాయిస్వామి తోపాటు ఆంజనేయస్వామికి దర్శించుకున్నారు. అనంతరం నేడు పెద్ద సరిగెత్తును పురస్కరించుకుని ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యూలైన్‌లో భక్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో టిడిపి నాయకులు ఆకుల బాబు, నాయకులు జిసి బాబు, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ మమతాదేవి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, విద్యుత్ ఎఇ నీలకంఠ, కార్యదర్శులు శ్రీనివాసులు, కీర్తన, మాజీ కోఆప్షన్ సభ్యులు జాఫర్‌వలి, టిడిపి నాయకులు రాజన్న, నరసింహులు, ఓబులేసు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ టిడిపి' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్ మండలం డోనేకల్ గ్రామంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



పి4పై సమీక్ష సమావేశం జరుగుతుండగా సెల్‌ఫోన్ ముచ్చట్లలో నిమగ్నమైన అధికారులు

సమీక్ష వద్దు.. సెల్‌ఫోన్ ముద్దు..!

సమావేశంలో అధికారుల సెల్ ముచ్చట్లు

ప్రజలకు జవాబుదారీగా ఉండి బాధ్యతగా మెలగాల్సిన అధికారులు వారి విధులను పక్కన బెట్టారు. ప్రజావసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేసే సమీక్ష సమావేశంలో అధికారులు సెల్‌ముచ్చట్లతో మునిగిపోయారు. మీడియా, ఇతర ఉన్నతాధికారులు చూస్తున్నారన్న సోయ కూడా లేకుండా సెల్ రీల్స్ చూస్తూ గడిపేశారు. శనివారం నాడు పెనుకొండ ఆర్డీవో కార్యాలయం భువన విజయం సమావేశ మందిరంలో అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పి-4 అమలుపై పెనుకొండ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశాన్ని ఆర్డీవో ఆనంద్ కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. పి4 యాక్షన్ ప్లాన్‌పై అధికారులు చర్చల అనంతరం మంత్రి మాట్లాడుతున్న సందర్భంలో అధికారులు సెల్ ఫోన్‌లో నిమగ్నం అయ్యారు. కనీసం మంత్రి ఏమి చెబుతోంది అన్నది కూడా వినకుండా సెల్ ప్రపంచంలో మునిగిపోయారు. మంత్రి మాట్లాడుతుంటే 'సమీక్ష మాకొద్దు.. సెల్‌ఫోన్ ముద్దు' అన్న రీతిలో అధికారులు వ్యవహరించారు. అధికారుల సెల్‌ముచ్చట్లపై అక్కడున్న మీడియా, ఇతర నాయకులు విస్మయం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-పెనుకొండ

ఎండైనా.. వానైనా..

బయటే భోజనాలు

మరుగుదొడ్డికి వెళ్లాలంటే క్యూలో ఉండాల్సిందే.. బొమ్మనహాల్ కస్తూరిబాలో విద్యార్థినుల అగచాట్లు



ఆరుబయటే భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఎండ అయినా.. వాన వచ్చినా.. ఆరుబయట భోజనాలు చేయాల్సిందే... లేదంటే పస్తుండాల్సిందే.. ఎక్కడో కాదు మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల హైస్కూలలో విద్యార్థినుల పరిస్థితి. ఇక్కడ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలతోపాటు జూనియర్ కళాశాల కూడా ఉంది. రెండూ ఒకే భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఇందులో దాదాపు 80 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వీరందరూ ఉదయం, రాత్రికి భోజనమైనా.. అల్పాహారమైనా ఆరుబయట చేయాల్సిందే. ఎందుకంటే విద్యార్థినులకు ప్రత్యేకంగా భోజనం చేసేందుకు హాలు లేదు. ఎండ అయితే అలాగే కూర్చొని తింటారు. అదే వర్షం వచ్చిందంటే మాత్రం ఆదిపోయే వరకూ వేచి చూడాల్సిందే. వీటికితోటు మరుగుదొడ్లు కూడా తక్కువగా ఉండటంతో క్యూలో నిలబడాల్సిన దుస్థితి. ఇందుకోసం తెల్లవారుజామునే లేవాల్సి వస్తుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కస్తూరిబాలో ప్రత్యేక భోజనశాల ఏర్పాటు చేయడంతోపాటు మరిన్ని మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విషయంపై స్పెషల్ ఆఫీసర్ కమలమ్మ వివరణ కోరగా అలాంటిదేమీ లేదని దాటవేశారు.

సన్నగిల్లుతున్న ఆశలు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఖరీఫ్‌పై ఆశలు సన్నగిల్లుతున్నాయి. మే నెలలో మండు వేసవి మంచి వర్షాలొచ్చాయి. దీంతో ఈ సీజన్ మంచి వర్షాలొస్తాయని రైతులు ఆశించారు. ఈ మేరకు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ మాసంలోనే వర్షం నేల పడకపోవడంతో ఆశలు సన్నగిల్లుతూ వస్తున్నాయి. జూన్ నెల మొత్తానికి రెండు రోజులు మాత్రమే వర్షం పడింది. అది కూడా కొన్ని ప్రాంతాల్లోనే వర్షపాతం నమోదయింది. చాలా ప్రాంతాల్లో చినుకు జాడలేదు. ఇక జిల్లాలో ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన నెల జులై మాసమే. ఈ నెల రెండవ వారం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతే పంటల సాగు ప్రశ్నార్థకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రోజు కారు మబ్బులు కమ్ముకుని రావడం తెలిపాటి చిరుజల్లులు పడి మేఘాలు గాల్లోనే తేలిపోతున్నాయి. రైతులు ఒక పదునైనా కాదా అంటూ ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీఫ్ వ్యవసాయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే వేరుశనగ క్రమక్రమంగా తగ్గిపోతూ వస్తోంది. ఇతర పంటల వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. కంది, ఆముదం, పత్తి తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. వేరుశనగ అయితే పెట్టుబడులు ఎక్కువ, దిగుబడులు తక్కువగా అన్నట్టుగా మారడంతో రైతులు పంటల సరళిలో మార్పు వస్తోంది. మారినప్పటికీ ప్రకృతి మాత్రం ఏ మాత్రం రైతుకు సహకరించే పరిస్థితులు కనిపించడం లేదు. గతేడాది జూన్ మాసం మంచి వర్షాలొచ్చినప్పటికీ జులై మాసంలో వర్షాభావం నెలకొంది. ఆగస్టు రెండవ వారం నుంచి విపరీతంగా వర్షాలు పడ్డాయి. సీజన్‌లో విత్తనం విత్తుకునే సమయంలో లేకపోవడంతో రైతులు పూర్తి స్థాయిలో పంటలు సాగు చేయలేకపోయారు. ఇక ఈసీజన్ కూడా ఇదే వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటిని అందించే రెండు జలాశయాలు తుంగభద్ర, శ్రీశైలం డ్యామ్‌లకు నీరొచ్చింది. ఈ నీటిని తీసుకునేందుకు ఇప్పుడు వీల్లేకుండా ఉంది. తుంగభద్ర డ్యామ్ నుంచి తీసుకోవలంటే ఎగువ ప్రధాన కాలువ మరమ్మతు పనులు పూర్తవలేదు. ఇవి పూర్తయి తీసుకోవడానికి చాలా సమయమే పెట్టనుంది. అప్పటి వరకు అవకాశమున్నా నీటిని తీసుకోలేకపోతున్నాం. ఇక శ్రీశైలం నుంచి తీసుకోవాలన్నా హంద్రీనీవా వెడల్పు పనులు నడుస్తున్నాయి. ఇవి పూర్తవుతేగాని హంద్రీనీవాకు నీళ్లు రావు. ఇలా అవకాశమున్న దగ్గర నీరు తీసుకోలేక సకాలంలో ఆయకట్టు రైతుకు నష్టం చేకూరే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

ఈవారంలో రాజకీయంగా అధికార పార్టీలో పెద్ద దుమారమే రేగింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుక సంస్థకు చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కొనుగోలు చేసి ఇ-స్టాంపు ట్యాంపరింగ్ విషయం రాజకీయ దుమారం రేపింది. స్టాంపు వెండర్ ద్వారా ఈ ట్యాంపరింగ్ జరిగిందని పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశారు. అది అధికారపార్టీకి చెందిన మరో నాయకుడే కుట్ర పన్నారని రావడం, దానికి ఆయన కూడా స్పందించి తాను చేయలేదని మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. శింగనమల నియోజకవర్గంకు సంబంధించి ఎమ్మెల్యే బండారు శ్రావణి , టుమెన్ కమిటీ సభ్యుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. నియోజకవర్గం పరిధిలో పార్టీ కమిటీల ఏర్పాటులో వివాదాలు కొనసాగాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య తాడిపత్రికి చేరే విషయంలో వివాదం రచ్చకెక్కింది.

వైసిపి సర్పంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్


పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

శెట్టూరు మండలంలోని ములకలేడు వైసిపి సర్పంచు లక్ష్మీదేవి, భర్త నాగరాజు టిడిపిలో చేరారు. ఈమేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిడిపిలో చేరిన సర్పంచు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా సర్పంచులను అప్పుల పాలు చేశారన్నారు. సర్పంచులు కేవలం బొమ్మలుగా మాత్రమే మిగిలిపోయారన్నారు. గ్రామాలను అస్తవ్యస్తంగా మార్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలకు పునరుజ్జీవం పోశారన్నారు. టిడిపిలో చేరిన వారిలో ఎస్.తిప్పేస్వామి, రాజు, బాబు, రంగయ్య, పాళ్యం మారుతి, విజయ్‌కుమార్, కవితమ్మ, రామక్క, గౌరమ్మలు, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు టీఆర్ తిప్పేస్వామి, ఎంపిటిసి లింగప్ప, మాజీ వైస్ ఎంపిపి బొమ్మయ్య, డీడీ మూర్తి, నరసింహమూర్తి, మాజీ జడ్పిటీసీ గురుప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి రామరాజు, సర్పంచు కుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పాలబండ హనుమంతురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నగేష్‌యాదవ్, రుద్రముని, గోవిందప్ప, సుబ్బరాయుడు, వీరన్న, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా

ప్రజాశక్తి-అనంతపురం సిటీ


అనంతపురంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఏజిఎం సుబ్బారెడ్డి, విద్యార్థులు


స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏజిఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగతికి మూలాధారం చెట్టే అన్నారు. వాతావరణం సమతుల్యంగా ఉండటానికి ప్రతిఒక్కరూ తప్పక మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జ్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక శ్రీచైతన్య టెక్నో పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'పచ్చని చెట్టు - ప్రగతికి మెట్టు, చెట్టును పెంచు - పర్యావరణాన్ని రక్షించు, వృక్షో రక్షతి రక్షితః, డోంట్ కట్ ద ట్రీస్, సేవ్ ద వాటర్' అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ యువరాజ్, ప్రిన్సిపాల్ ఫిలిప్‌కుమార్, డీన్ ఈశ్వరరెడ్డి, పాఠశాల ప్రైమరీ ఇన్‌ఛార్జులు, ఉపాధ్యాయులు, పిఇటిలు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ మానుకోండి

ఎక్సైజ్ కమిషనర్ నాగ ముద్దయ్య

ప్రజాశక్తి-బెలుగుప్ప


మాట్లాడుతున్న వక్తలు

నాటుసారా తయారు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని అనంతపురం డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ నాగ ముద్దయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎర్రతాత ఆలయంలో నవోదయం 2.0పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసేవారు కేసులతో పోలీస్‌స్టేషన్లు, కోర్టులు చుట్టూ తిరిగి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. దీనికితోడు మీపై కేసులు అయితే మీ పిల్లల భవిష్యత్తు నాశనం అవుందన్నారు. కావున అందరూ నాటుసారాకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్లు సోమశేఖర్, కె.జైనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు



పామిడిలో ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు


ప్రజాశక్తి-పామిడి

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛారీలు తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఎం డివిజనల్ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రహీం డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎద్దులపల్లి క్రాసింగ్, అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అదానీతో మాజీ ముఖ్యమంత్రి జగన్ సెమి ఒప్పందాన్ని కుదుర్చుకుని రూ.1.750 కోట్లు లంచం తీసుకున్న ఫలితంగా 25ఏళ్లపాటు ఎపిలో విద్యుత్ వినియోగదారులపై రూ.1.10లక్షల కోట్లు పెనుభారం మోపిందన్నారు. దీనితోడు నాలుగుసారు విద్యుత్ ఛార్జీలు మోపిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు ఎక్కడ బిగిస్తే అక్కడే పగలగొట్టండి అని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చాక అదే స్మార్ట్ మీటర్లను అమలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముత్యాలు, ఈశ్వరయ్య, శంకర, శివ, షాషు, వెంకటరాముడు, సుంక, సిపిఐ నాయకులు సూర్యనారాయణరెడ్డి, ఓంకార్, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్, కల్లూరు చౌడప్ప, ఆర్టీసీ శాఖ కార్యదర్శి ఇమాం, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛారీలు తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీటి రామాంజనేయులు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్ గోపాల్‌యాదవ్, ఎన్.గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.15.485 కోట్ల భారం మోపిందన్నారు. అంతేగాకుండా గృహాలకు స్మార్ట్‌మీటర్లను బిగించేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు బి.చిన్నికృష్ణుడు యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.చిన్న కుళ్లాయప్ప, కమిటీ నాయకులు బి.ఓబుల్‌రెడ్డి, టి.వీరయ్య, కె.నాగపుల్లయ్య, మారుతి, అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

విప్ కాలవ శ్రీనివాసులు


చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన చిన్నారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని 6, 9వ వార్డుల పరిధిలో తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థికసాయం పొందిన తల్లులు పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోరాలు పురుషోత్తం ఆధ్వర్యంలో శనివారం సెయింట్ పాల్ హై స్కూల్‌లో 'కృతజ్ఞతాభి వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో జాతీయస్థాయిలో గుర్తింపు అందుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగు పరచడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో రాయదుర్గం నియోజకవర్గంలో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు తీసుకురావడానికి తాను చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారో నేరుగా సంబంధిత ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి తెలుసుకోటానికి వీలుగా ఈనెల 10న మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు ప్రశాంతి, పద్మజ, తహశీల్దార్ నాగరాజు, ఎంఇఒ వెంకట రమేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటేశులు, మాజీ వార్డు సభ్యులు ధనార్జున, వెంకటేశులు, సుమలత, టిడిపి నాయకులు గౌరీ, ఇనాయత్, తిప్పేస్వామి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వందశాతం హాజరు నమోదు చేయాలి

విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు


రాయదుర్గం ఎంఇఒ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో హాజరు వివరాలు పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు శ్రీదేవి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలను వందశాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు కెఎన్ మల్లికార్జున, ఎ.శ్రీదేవి, ఏసుబాబు సువర్ణ సంధ్య సూచించారు. శనివారం రాయదుర్గం, గుమ్మగట్ట మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు వివరాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి అభ్యంతరాలు ఉన్నచోట నేరుగా ఉపాధ్యాయులతో మాట్లాడి సందేహ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కారణాల సాకుతో హాజరు శాతాన్ని నమోదు చేయొద్దన్నారు. రాయదుర్గం మండలం 74 ఉడేగోళం పాఠశాలలో దృష్టి లోపం ఉన్న ఉపాధ్యాయులు ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. గుమ్మఘట్ట మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో పని చేసే బోధనేతర సిబ్బంది నిర్ణీతవేళలో వారి హాజరు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వెంకటరమేష్, నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వినతి

నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగి శివ కోరారు. ఈమేరకు శనివారం రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు కెఎన్ మల్లికార్జున, శ్రీదేవిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 345 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక పేద విద్యార్థులు విద్యకు దూరమయే పరిస్థితులు ఉన్నాయన్నారు. కావున తక్షణమే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని చేరారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎంఇఒ వెంకట రమేష్ కూడా ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం


అర్బన్ బ్యాంకులో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, పాలవర్గం సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక సుభాష్ రోడ్డులో ఉన్న అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఛైర్మన్ జెఎల్ మురళీధర అధ్యక్షతన శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెఎల్ మురళి మాట్లాడుతూ దేశ ఆర్థిక పురోగాభివృద్ధికి సహకార సహకార వ్యవస్థ ఎంతోగానో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా సహకార రంగంలో అనంతపురం కో-ఆపరేటివ్ అనంతపురం అర్బన్ బ్యాంకుకు వందేళ్లకుపైగా చరిత్ర కలిగి ఉందన్నారు. అర్బన్ బ్యాంకు ప్రజలందరి మనలతో దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు వైస్ ఛైర్మన్లు మాగిశెట్టి చంద్రశేఖర్, మణి సుబ్రమణ్యం, డైరెక్టర్లు గోల్డ్ బాషా, రమణయ్య, జంగంశెట్టి రామాంజనేయులు, సుంకర రమేష్, కృష్ణకుమార్, చింతా భాస్కర్, వెంకటాద్రి, రోళ్ల భాస్కర్, అనిల్‌నాయుడు, సిఇఒ విజయ్‌భాస్కర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే ఎడిసిసి బ్యాంకులో ఛైర్మన్ కేశవరెడ్డి అధ్యక్షతన నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా సహకార అధికారిణి అరుణకుమారితో కలిసి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ సూర్యనారాయణ, డిడిఎం అరుణ, డిజిఎంలు రామ్‌ప్రసాద్, విజయ్‌చంద్రారెడ్డి, సుఖదేవబాబు, తదితరులు పాల్గొన్నారు.

అలగే రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారిణి అరుణకుమారి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు రాజారెడ్డి, నారాయణస్వామి, వి.నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి ఐదుగురికి అస్వస్థత


అస్వస్థత గురైన వారికి కొబ్బరి బోండాలు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని 11వ వార్డు తిలక్‌నగర్ సాయికృష్ణ ఆసుపత్రి వెనుక కాలనీలో కొళాయిల నుంచి వచ్చిన కలుషిత నీరు తాగి ఐదుగురు స్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. 11వ వార్డులోని సాయికష్ణ ఆసుపత్రి వెనుక కాలనీలో శనివారం ఉదయం మున్సిపల్ సిబ్బంది కొళాయిలకు నీరు వదిలారు. కొళాయిల్లో రంగుమారిన దుర్వాసనతో నీరు వచ్చింది. ఆ నీటిని తాగిన కాలనీకి చెందిన వనజ, స్వాతి, గీత, దీపిక, భారత్‌కి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. గమణించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌ను వివరణ కోరేందుకు చరవాణి ద్వారా ప్రయత్నించగా స్పందించలేదు. విషయం తెలుసుకున్న సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, కమిటీ సభ్యులు రామునాయక్, షబ్బీర్, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఆనంద్, సిపిఐ నాయకులు మహేష్, గౌస్, రామాంజినేయులు, ఈశ్వరయ్య తదితరులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని డ్యూటీ డాక్టర్ సల్మాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ నెలరోజుల నుంచి కొళాయిల్లో బురద, మట్టితో కూడిన నీరు వస్తోందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను కలుపుకుని సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే వైవిఆర్‌ను కలిసిన నాయకులు


వైవిఆర్‌తో గుత్తి నాయకులు

గుత్తి : మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని గుత్తికి చెందిన వైసిపి నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక పట్టణానికి చెందిన హేమలతకు వైసిపి పట్టణ మహిళ అధ్యక్షురాలుగా నియమించారు. దీంతో ఆమెతో పాటు వైసిపి నాయకులు గుంతకల్లులోని మాజీ ఎమ్మెల్యే వై వి ఆర్ నివాసానికి వెళ్లారు. ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీ రెడ్డి, వైసిపి నాయకులు మంజునాథ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బింగి కిరణ్, బి.రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ వాల్మీకి శివ, నాయకులు పుల్లారెడ్డి, క్రాంతి, రఘురాం, బబ్లూ, షఫీ, శేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, శివారెడ్డి, హాబీ, ఎర్రిస్వామి, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలతో పంటలకు భారీ నష్టం


పత్తి పంటను చూపుతున్న సర్పంచు పరమేశ్వర

బొమ్మనహాల్ : మండల పరిధిలోని నేమకల్లు గ్రామంలో ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న దుమ్మూ దూళితో పత్తి పంట రంగు మారి మార్కెట్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని సర్పంచు పరమేశ్వర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాకుండా దిగుబడి కూడా భారీగా తగ్గిందన్నారు. ప్రతి ఎకరాకు కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఐదు క్వింటాళ్లకే పరిమితమైందన్నారు. ఈ దిగుబడిని కూడా మార్కెట్‌కు తీసుకెళ్తే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేమకల్లు గ్రామంలో సుమారు 3000 ఎకరాల వరకూ పత్తిపంట సాగు చేశారు. వీటితోపాటు వంద ఎకరాల్లో కంది పంట సాగు చేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బుక్కరాయసముద్రం : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేంద్ర బృందం సభ్యులు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025లో మండలంలోని జంతలూరులో కేంద్రం బృందం పర్యటించింది. ఇందులో భాగంగా పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం నిర్వాహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీలు, దేవాలయాల్లో మరుగుదొడ్ల నిర్వహణపై సర్వే చేశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. కావున ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, డిపిఒ ఆఫీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు

రాయదుర్గం రూరల్ : ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సామూహిక యాంటి రేబిస్ వ్యాధి నివారణ వాక్సిన్ (పిచ్చికుక్క కాటు వ్యాధి)ని ఆదివారం ఉచితంగా వేయనున్నట్లు పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో కుక్కలు, పిల్లులకు వేయనున్నట్లు చెప్పారు. అలాగే పెంపుడు జంతువుల యజమానులు తమ పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీరేబిస్ టీకాలను వేయించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

రాయదుర్గం : యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆందోళనలో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఎపిఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా రీజినల్ నాయకులు కల్లప్ప, పిఎస్ఎ ఖాన్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి రామలింగప్ప, వలి, శ్రీరాములు, బాషా, తిప్పారెడ్డి, అరుణ్, హిదయతుల్లా, గ్యారేజీ కార్మికులు ఆది, సిద్ధ, రతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

'భాష్యం' విద్యాసంస్థల్లో మాక్‌పోలింగ్


ఓటు వేసినట్లు వేలు చూపుతున్న అతిథులు, విద్యార్థులు

అనంతపురం : నగరంలోని జీసస్‌నగర్‌లో ఉన్న భాష్యం స్కూల్‌లో శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఇందులో జిల్లా జెడ్పీ సిఇఒ రవివర్మ పాల్గొని తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దేశంలో ఓటుహక్కుకు ఉన్న ప్రాముఖ్యత, మేనిఫెస్టో అంటే ఏంటి.. రాజకీయాల్లో యువత ప్రాముఖ్యతను వివరించారు. పోలింగ్‌లో ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

ఉరవకొండ : ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూలై 10న మేగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి విద్యార్థి తల్లి లేదా తండ్రిని కచ్చితంగా హాజరుకావాలన్నారు.

వైఎస్ఆర్ జయంతిని విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి

పుట్లూరు : ఈనెల 8వతేదీన నిర్వహించనున్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి వెంకటరమణ, మడ్డిపల్లి ప్రభాకర్‌రెడ్డి, రంగరాజు, గుంట సూర్యనారాయణరెడ్డి, గూడూరు రమణారెడ్డి, పుట్లూరు సర్పంచు ఓబులేసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తండ్రిని హత్య చేసిన కొడుకు


మృతిచెందిన గంగయ్య

నార్పల : తండ్రిని రోకలిబండతో మోది కొడుకు హత్య చేసిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో కుటుంబ కలహాలతో తండ్రి పెద్ద గంగయ్యను కొడుకు చిన్న శివయ్య రోకలి బండతో దాడి చేశారు. గమణించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గంగయ్య అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసున నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యల్లనూరు : మండల కేంద్రంలోని చెరువు కట్టపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన ఓబులేసు, తన బంధువు కలిసి ద్విచక్ర వాహనంపై దాడితోటకు వెళ్తుండగా చెరువు కట్టపై రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర ఉండటంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు యల్లనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఓబులేసుకు కాలికి తీవ్ర గాయమైనట్లు వైద్యులు లోకేష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి..

గుత్తి : మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ధర్మాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు భార్య గొల్ల లక్ష్మీదేవి ఇంటి వద్ద కల్లాపు చల్లుతుండగా పక్కన ఉన్న విద్యుత్ స్తంభం స్టే వైరు తగలడంతో ప్రమాదానికి గురై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఫక్రుద్దీన్ అనే వ్యక్తి తన ఇంటి పైన పనులు చేయడానికి వెళుతుండగా 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే వారు ప్రమాదానికి గురైనట్లు పలువురు వాపోతున్నారు. యుద్ధ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

సమస్యల పరిష్కారానికి చర్యలు-'తొలి అడుగు'లో మంత్రి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే గ్రామాలు అభివృద్ధి చెంది సుపరిపాలన సాధ్యమని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్ మండలం డోనేకల్ గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, చేపట్టిన అభివృద్ధి వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజల్లో ఉన్న భయం, అశాంతి పోయిందన్నారు. ప్రస్తుతం ఒక భరోసా, ప్రశాంతత వచ్చిందన్నారు. గతంలో తమకు వస్తున్న పథకాలు ఏమవుతున్నాయో అనే దాని నుంచి ప్రజలు నేరుగా వచ్చి తమకు సమస్యలు తెలిపే పరిస్థితి వచ్చింద్కన్నారు. పది పదహైదు రోజుల్లో తాగునీటి పైప్‌లైన్ వేసి డోనేకల్ గ్రామానికి శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. గతంలో ఇదే గ్రామంలో 220 మందికి అమ్మఒడి పడితే, తమ ప్రభుత్వంలో 430 మందికి తల్లికివందనం పడిందన్నారు. సంక్షేమంలో రెట్టింపు ఇస్తున్నామన్నారు. పెన్షన్ గతంలో 250 పెంచితే తాము రూ.వెయ్యి పెంచామని,అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థికసాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రస్తుత ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఏ ఇంటికి వెళ్లి అడిగినా తమ ఇళ్లకే నేరుగా సంక్షేమ పథకాలు వస్తున్నాయని చెబుతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధులు తమను చూస్తానే చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారన్నారు. ఠంచనుగా ప్రతినెలా 1వతేదీన తాము లేవకనే పింఛన్ అందుతోందని చెబుతున్నారన్నారు. పింఛన్ పెంపుతో పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా వచ్చిందన్నారు. దీనికితోడు తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇకపోతే త్వరలోనే మరవకొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు దండు శ్రీనివాసులు, మారుతీనాయుడు, జిసి బాబు, ఆదినారాయణ, సత్యనారాయణ, అట్టే రామాంజనేయులు, అనిల్‌కుమార్, నాగేష్, కాయగూరల సత్తి, మసూద్‌వలి, చాకలి వెంకటేష్, పెదనాగముని, కాయల రమణయాదవ్, ఎర్రిస్వామి, తరిమెల అనిల్, మాసూలు చంద్రమోహన్, ఎంపిడిఒ భాస్కర్, ఉపాధి హామీ ఎపిఒ భాగ్యలక్ష్మి, ఇసి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో పాల్గొన్న ఎంపి అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి



మహిళలతో సెల్ఫీ దిగుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

యాడికి : మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, పరిమి చరణ్, నాగ మునిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, బొట్టు శేఖర్, బిజెపి మండల అధ్యక్షుడు వడ్డీ రాజశేఖర్, మధురాజు, వెలిగండ్ల ఆదినారాయణ, కోడూరు నీలకంఠారెడ్డి, నరసింహచౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమాభివృద్ధి పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మారుతీనగర్‌లో 'సుపరిపాలనలో ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ ఇన్‌ఛార్జి గోళ్ల సుధాకర్‌నాయుడు, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, జెఎల్ మురళీధర్, రాయల్ మురళి, గడ్డం సుబ్రమణ్యం, పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్‌ఎన్ మూర్తి, పరమేశ్వర్, బొమ్మినేని శివ, సరిపూటి రమణ, డిష్ నాగరాజు, దలవాయి వెంకటనారాయణ, సుధాకర్ యాదవ్, సాకే లక్ష్మీనరసింహ, కుంచెపు వెంకటేష్, రాజా రావు, సంగ తేజస్విని, సరళ, భావన తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులు చేస్తున్న కార్మికులు

పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్

ఉరవకొండ : మొహరం పండుగ సందర్భంగా విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు, గాజుల మల్లాపురం గ్రామాల్లో సర్పంచు బ్యూలా రాణి రాజశేఖర్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు చేపట్టారు. అలాగే వీధిలైట్లు, బ్లీచింగ్ పౌడర్, తాగునీటి మోటర్ రిపేర్, తదితర పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పుండుకూరు సుంకన్న, శర్మాస్, ఎలక్ట్రికల్ వర్కర్లు, స్వచ్ఛభారత్ టీంవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

టూవీలర్ మెకానిజంలో ఉచిత శిక్షణ

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి వద్ద ఉన్న రూడ్‌సెట్ సంస్థలో టూ వీలర్ మెకానిజంలో 30 రోజులపాటు ఉచిత శిక్షణ, వసతి భోజన సౌకర్యం కల్పించనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఉరవకొండ : వర్షాకాలంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడంతోపాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకుందామని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండలోని ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సిరికల్చర్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రసాద్‌రెడ్డి, అధ్యాపక బృందానికి, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి, అధ్యాపకురాలు పద్మజకు మొక్కలు అందించారు. ఈ సందర్భంగా నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

మెగా పేరెంట్స్ సమావేశానికి సాక్షుల నియామకం బాధాకరం

అనంతపురం : రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10వతేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు సాక్షిగా ఇతర ఉద్యోగులను నియమించడం బాధాకరమని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గుజ్జల శివయ్య, డేగవత్ రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థి తల్లిదండ్రులను మమేకం చేసి పండుగ వాతావరణాన్ని నెలకొల్పామన్నారు. అయితే ఇప్పుడు బాహ్య పరిశీలకుల పేరిట ఇతర శాఖల వారిని వీడియో రూపంలో అప్‌లోడ్ చేయమనడం మంచిది కాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అరటిలో ఎరువుల వాడకంపై అవగాహన

బుక్కరాయసముద్రం : అరటిలో ఎరువులు వాడకవంపై రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త జి.త్రికల మాధవి, సస్యరక్షణ శాస్త్రవేత్త కిషోర్ అవగాహన కల్పించారు. శనివారం నార్పల మండలం సిద్ధరాచెర్ల గ్రామంలో సాగుచేసిన అరటి, చీనీ నర్సరీలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా అరటి సాగులో ఎన్ని రోజులకు ఏ మందులు వాడాలో రైతులకు వివరించారు.



అరటిపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎం ఇల్లూరు సీతానంద శనివారం ఫర్నిచర్‌ను విరాళంగా ఇచ్చారు. ఈయన ఈ పాఠశాల నుంచి బదిలీ అయిన సందర్భంగా రూ.25వేలు విలువజేసే టేబుళ్లు, కుర్చీలను విరాళంగా ఇచ్చారు. ఆయనతో పాటు బదిలీ అయిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆసిఫ్‌ను కౌన్సిలర్ గద్దల రూతమ్మ, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రామాంజనేయులు ఆధ్వర్యంలో సన్మానించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 253 కేసులు పరిష్కారం

గుత్తి : స్థానిక న్యాయస్థానాల ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి బిసాదుబాబు, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి లు 253 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ పక్రుబాషా, న్యాయవాదులు కె. శ్రీనివాసులు, పి.శివకుమార ఆచారి, ఎంవి మహేష్, జెడ్. సతీష్, ఎంఎం రసూల్, ఎన్.ఓబులేసు, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీకి గౌని ప్రతాపరెడ్డి రాజీనామా

రాయదుర్గం : భారత చైతన్య యువజన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, నియోజకవర్గ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు న్యాయవాది రైతు రక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. బిసివై రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షులుగా రెండు సంవత్సరాల నుంచి బీసీవై పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేసినట్లు చెప్పారు. అధినేత రామచంద్ర యాదవ్ సైతం తనకు రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి గత ఎన్నికల్లో ప్రోత్సహించారన్నారు. తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అధినేత రామచంద్ర యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.

అన్నదానం

అనంతపురం : సాయిట్రస్టు ఆధ్వర్యంలో సాయి నిత్య నారాయణ సేవ కార్యక్రమం 17వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అన్నదానానికి స్థానిక రఘువీరా టవర్స్‌లోని శక్తి స్వరూప్ చిట్స్ అధినేత వెంకట్‌రెడ్డి తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ మాట్లాడుతూ ఏ మతమైనా.. ధర్మమైనా తోటి వారిని ప్రేమించాలి, సహకరించాలనే చెబుతాయన్నారు. ఇందులో భాగంగానే సాయిట్రస్టు ద్వారా రోజూ వివిధ ప్రాంతాల్లో ఎంతో మందిదాతల సహకారంతో నారాయణసేవ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాయిట్రస్టు సభ్యులు, రాఘవేంద్ర, సుధాకర్, ఫణీంద్ర, వీరేష్, విజయభాస్కర్, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతో ఆర్డీటీని కాపాడుకుందాం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఐక్య ఉద్యమాలతోనే జిల్లాలో ఆర్డీటీని సాధించుకోగలమని ఆర్డీటీ పరిరక్షణ జెఎసి కన్వీనర్ సాకే హరి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి ఆర్డీటీ పరిరక్షణ జెఎసి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు త్వరలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌ను ముఖ్య కార్యాలయంలో కలిశారు. ఈ కార్యక్రమంలో వైబి ఓబయ్య, జడ్పిటిసి గుద్దేళ్ల నాగరాజు, లింగప్ప, ఎమ్మెస్ హనుమంతురాయుడు, నిజాంవలి, బాబు, సుగమంచి శ్రీనివాసులు, రామకృష్ణ, రాకెట్ల సూర్యనారాయణ, దొడ్డి నరసింహులు, పెద్దన్న, శివ, సుబ్బారాయుడు, అనసూయమ్మ, మాధవి, సిబిటిలు, మహిళలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

గుంతకల్లు : ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టియు నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై ఉక్కుపాదం మోపుతూ హక్కులను హరిస్తోందన్నారు. కార్పొరేట్ కంపెనీలు, బడా పెట్టుబడిదారులు, బహుళ జాతి కంపెనీలకు ఉపయోగపడే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. వీటి వల్ల కార్మికులు యాజమాన్యానికి కట్టు బానిసలుగా ఉండే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున కేంద్రం వెంటనే స్పందించి లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, రాందాస్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జిలాన్, సత్తార్, పట్టణ కమిటీ సభ్యులు నారాయణ, బాషా, విశ్వనాథ్, వషకేరి, తదితరులు పాల్గొన్నారు.